క్లుప్తంగా

నేడు దివ్యాంగులకు బస్‌పాస్‌ల జారీ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం బస్టాండ్‌లో గల బస్‌పాస్ కౌంటర్‌లో బుధవారం దివ్యాంగులకు బస్‌పాస్‌ల జారీకై స్పెషల్ క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం, ఆగాపల్లి, యాచారం, గున్‌గల్, చింతుల్ల, ఆకులమైలారం, గుమ్మడవెల్లి, దండుమైలారం, మంచాల, ఆరుట్ల, శేరిగూడ, మంగళ్‌పల్లి, కొంగరకలాన్, కందుకూర్ పరిసర ప్రాంతాల్లో నివసించే దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఒక పాస్‌పోర్ట్ సైజు ఫొటో, సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఐడీ కార్డును తీసుకురావాలని తెలిపారు. సర్వీస్ చార్జి కింద రూ. 50 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

నేడు రైతువేదిక వద్ద సమావేశం

ఇబ్రహీంపట్నం రూరల్: ఉప్పరిగూడ రైతువేదిక వద్ద నేడు నిర్వహించనున్న సమావేశానికి బీఆర్ఎస్ నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ మొద్దు అంజిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ సమావేశానికి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారన్నారని అంజిరెడ్డి తెలిపారు.

శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే



తిరుమల శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజల అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ అధికారులు, వేదపండితులు, పట్టు వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురువాలని, పాడిపంటలతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని శ్రీవారిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

దివ్యాంగులకు అండగా నిలుద్దాం: కౌన్సిలర్



దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేస్తున్న కౌన్సిలర్ యాదగిరి

ఇబ్రహీంపట్నం రూరల్: దివ్యాంగులకు సేవలందించడం తృప్తినిస్తుందని ఆదిబట్ల మున్సిపాలిటీ 15వ వార్డు కౌన్సిలర్ కమాండ్ల యాదగిరి పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీలోని ఎంపీ పటేల్‌గూడ పట్టణానికి చెందిన 100 మంది వికలాంగులకు తమవంతు సహకారంగా బస్‌పాస్‌ల రెన్యూవల్‌కు అవసరమయ్యే నగదును ఆయన ఆర్టీసీ అధికారులకు చెల్లించారు. అనంతరం బస్‌పాస్‌లను వార్డు కార్యాలయం వద్ద వికలాంగులకు కౌన్సిలర్ కమాండ్ల యాదగిరి అందజేశారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ జిల్లా నాయకులు శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం: ఆచారి

తలకొండపల్లి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బీజేపీ సీనియర్ నేత ఆచారి ఆ పార్టీ నాయకులకు సూచించారు. స్వర్ణశక్తికర్ర అభియాన్‌లో భాగంగా మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆచారి పర్యటించారు. ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా బీజేపీ మండల అధ్యక్షుడు రవిగౌడ్, స్థానిక నాయకులతో కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రవిగౌడ్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సర్పంచ్ కుమార్, బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్, ఉప సర్పంచ్ అనిల్, రాష్ట్ర అదనపు కార్యదర్శి పాండు, జిల్లా ప్రధాన కార్యదర్శి పాండుప్రసాద్, శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, శివ, హరికాంత్ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

యాచారం: బీజేపీ అధిష్టానం పిలుపు మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని బాటసింగారంలో మంగళవారం జరిగిన టిఫిన్ బైఠక్‌లో యాచారం బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ ఆధ్వర్యంలో పలు గ్రామాల నుంచి శ్రేణులు తమ ఇళ్ల నుంచే భోజనం తీసుకెళ్లి అక్కడే భోజనం చేసి పార్టీ బలోపేతంపై చర్చించుకున్నారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం, కేసీఆర్ సర్కార్ వ్యతిరేక విధానాలు, హామీలపై పోరాటాలకు సిద్ధం కావాలని దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాషా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజయ్య యాదవ్, రమేష్, జంగయ్య గౌడ్, రాజు, కృష్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ రోడ్డుకు మహర్దశ

- ఖానాపూర్ గేట్ నుంచి తమ్మలోనిగూడ వరకు నాలుగు లేన్లుగా విస్తరణ!
- ప్రతిపాదనలు సిద్ధం చేసేపనిలో రోడ్డు భవనాల శాఖ
- ఆర్అండ్‌బీ ఇంజినీర్ ఇన్ చీఫ్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే మంచిరెడ్డి
- ప్రతిపాదనల ఆధారంగా నిధుల మంజూరుకు అవకాశం



నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారి

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారికి మహర్దశ పట్టనుంది. వాహనాల రద్దీ, తరుచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకై రోడ్డు భవనాల శాఖ నడుంబిగించనుంది. సాగర్‌రోడ్డుపై నిత్యం ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన వీఐపీలు, ఆర్టీసీ బస్సులు, ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు.. ఈ రోడ్డుపై ప్రతియేటా కొత్త, కొత్త పరిశ్రమలు, విద్యాసంస్థలు, వెంచర్లు, రియల్ వ్యాపార సంస్థలు పుట్టుకొస్తున్నాయి. దీంతో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. ఈ నేపథ్యంలో ఈ రోడ్డును నాలుగు వరుసల రహదారి(4లేన్)గా వెడల్పు చేస్తేనే మేలనే ఉద్దేశ్యంతో స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పట్టుదలతో ఉన్నారు. కొద్దిరోజుల కింద ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ ఇంజినీర్ ఇన్ ఛీఫ్ రవీందర్‌రావుతో మాట్లాడారు. ఇంజినీర్ ఇన్ చీఫ్ కూడా సాగర్‌రోడ్డు వెడల్పునకు సానుకూలంగా స్పందించారు. త్వరలో సాగర్‌రోడ్డు వెడల్పు నిర్మాణ పనులపై నివేదిక తయారు చేయాలని రోడ్డు భవనాల శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. రోడ్డు వెడల్పు పనులపై ఇబ్రహీంపట్నం డివిజన్ రోడ్డు భవనాల శాఖ డీఈఈ వేణుగోపాల్‌రెడ్డి నివేదిక తయారీలో నిమగ్నమయ్యారు

తమ్మలోనిగూడ గేట్ వరకు...

నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారి బీఎన్‌రెడ్డి నగర్ నుంచి ఇబ్రహీంపట్నం సమీపంలోని ఖానాపూర్ గేట్ వరకు ఇప్పటికే నాలుగు వరసల రహదారిగా ఉంది. ప్రస్తుతం ఖానాపూర్ గేట్ సమీపం నుంచి తమ్మలోనిగూడ గేట్ (రంగారెడ్డి జిల్లా పరిధి) వరకు నాలుగు వరసల రహదారిగా నిర్మించనున్నారు. సాగర్‌రోడ్డు ప్రస్తుతం 33 అడుగుల బీటీ రోడ్డుగా ఉంది. సాగర్‌రోడ్డుపై యాచారం మండల కేంద్రంలో కిలోమీటర్ మేర నాలుగు వరసల సిమెంట్ రహదారిని నిర్మించారు. అంతా అనుకున్నట్లు జరిగితే ఖానాపూర్ గేట్ నుంచి తమ్మలోనిగూడ గేట్ వరకు దాదాపు 25 కిలోమీటర్ల వరకు నాలుగు వరసల రహదారిగా వెడల్పు చేయనున్నారు. సాగర్‌రోడ్డుకు సమీపంలోనే ఫార్మాసిటీని కూడా ఏర్పాటు చేస్తున్న దష్ట్యా ఈ రోడ్డు వెడల్పుపై రోడ్డు భవనాల శాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. నివేదికల అనంతరం అనుమతులు రాగానే రోడ్డు నిర్మాణ పనులను ఓ కన్సల్‌టెన్సీకి అప్పగించే యోచనలో రోడ్డు భవనాల శాఖ ఉంది.

పైపులైన్లతోనే ఇబ్బంది..

సాగర్‌రోడ్డుపై ఇరుపక్కలా మూడు లైన్ల కృష్ణా తాగునీటి జలాల పైపులైన్లు ఉన్నాయి. సాగర్‌రోడ్డును నాలుగు వరసల రహదారిగా విస్తరించే నేపథ్యంలో పైపులైన్ల స్థానంలో రోడ్డును ఎలా నిర్మించాలో అని ఆర్అండ్‌బీ అధికారులు ఆలోచనలో పడ్డారు. 33 అడుగుల బీటీ రోడ్డుకు 2 అడుగుల దూరంలోనే పైపులైన్లు ఉన్నాయి. నాలుగు వరసల రహదారిగా మార్చితే రోడ్డు పక్కనున్న పైపులైన్లు దాటి అవతలికి రెండు, మూడు అడుగుల దూరం వరకు వెళ్తుంది. ఈ నేపథ్యంలో నాలుగు వరసల రహదారి వెడల్పు చేసేదెట్లా, పైపులైన్ల సంగతేంటి అనే విషయంలో అధికారులు తర్జనభర్జన పడుతున్నట్లు సమాచారం. ఖానాపూర్ గేట్ నుంచి తమ్మలోనిగూడ గేట్ వరకు రోడ్డుకిరువైపులా కష్ణాజలాల పైపులైన్‌కు ఎక్కడెక్కడ ఎన్ని ఎయిర్‌వాల్వ్‌లు ఉన్నాయి, పైపులైన్‌కు బిగించిన ఎయిర్‌వాల్వ్‌లు రోడ్డుకు మధ్యలో వస్తాయా లేకపోతే రోడ్డులోనే వస్తాయా అనే విషయాలపై సర్వే చేస్తేనే గాని ఒక అవగాహనకు రావచ్చని అధికారులు అంటున్నారు. ఇంకో విషయం ఏంటంటే నాలుగు వరసల రహదారిగా మారితే రోడ్డుకిరువైపులా నాటిన మొక్కలు, చెట్లను నరికివేయాల్సిన పరిస్థితి. హరితహారంలో భాగంగా రోడ్డుకిరువైపులా రూ.కోట్లాది ఖర్చు చేసి మొక్కలు నాటారు.

అందుబాటులో ప్రభుత్వ భూమి..

సాగర్‌రోడ్డును తమ్మలోనిగూడ వరకు నాలుగు వరసల రహదారిగా నిర్మిస్తే వ్యాపారపరంగా ఊహించని అభివృద్ధి జరిగే అవకాశం ఉంది. సాగర్‌రోడ్డుకు ఇరువైపులా ఎకరా వ్యవసాయ భూమి ఇప్పటికే రూ.2 కోట్లు దాటింది. నాలుగు వరసల రహదారిగా అయితే ఎకరా ధర రూ.4 కోట్లు దాటే అవకాశం ఉంది. సాగర్‌రోడ్డుకు సమీపంలోని మొండిగౌరెల్లి, నల్లవెల్లి, కొత్తపల్లి, చింతపట్ల తదితర గ్రామాల్లో ఉన్న వేలాది ఎకరాల ప్రభుత్వ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఇదే జరిగితే ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలతో హోటళ్లు,వ్యాపార సంస్థలు ఏర్పాటై స్థానికులకు ఉపాధి లభించనుంది.

నివేదిక తయారు చేస్తాం

సాగర్‌రోడ్డు ఖానాపూర్ గేట్ నుంచి తమ్మలోనిగూడ గేట్ వరకు నాలుగు వరసల రహదారిని నిర్మించాలంటూ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో రోడ్డు విస్తరణ పనులపై ప్రాథమిక నివేదిక తయారు చేసి అందజేయాలని ఉన్నతాధికారుల నుంచి మాకు ఆదేశాలు అందాయి. రోడ్డుకిరువైపులా కష్ణాజలాల పైప్‌లైన్లు ఉండటంతో నిపుణులతో రోడ్డు విస్తరణపై చర్చించనున్నాం.

– వేణుగోపాల్‌రెడ్డి, రోడ్డు భవనాల శాఖ డీఈఈ, ఇబ్రహీంపట్నం

సీఐ, ఎస్‌ఐకి సన్మానం



సీఐ, ఎస్‌ఐని సన్మానించిన నాయకులు

కడ్తాల్: ఆమనగల్లు సర్కిల్ నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లు, ఎస్ఐ బల్‌రామ్‌నాయక్‌ను మంగళవారం మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ ఘనంగా సన్మానించారు. నాయకులు సుజాత రాములు, సీతరాం నాయక్, పాండు, మోత్యానాయక్, తావుర్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి విజయ్‌రాథోడ్ ఆధ్వర్యంలో ఎస్ఐ బల్‌రామ్‌నాయక్‌ను సన్మానించారు. శ్రీనునాయక్, కుమార్‌నాయక్, హన్మానాయక్, కిషన్, భాస్కర్‌నాయక్, దస్రునాయక్ ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

మంచాల: మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురైన మారమ్మకు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సహకారంతో రూ.60వేల సీఎం రిలీఫ్ పండ్ చెక్కు మంజూరైంది. పార్టీ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం బాధితులకు చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు రాము, ప్రధాన కార్యదర్శి మహేందర్, జీఎంపీఎస్ చైర్మన్ చిందం జంగయ్య, నాయకులు శ్రీశైలం, వినోద్, వెంకటేష్, శ్రీకాంత్, సూర్య, వేణు, లక్ష్మణ్, పరమేష్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

సీఐ కాశీ విశ్వనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కాశీవిశ్వనాథ్

మంచాల: గ్రామాల్లో ఎలాంటి గొడవలకు తావు లేకుండా ప్రశాంతంగా జీవించాలని మంచాల సీఐ కాశీ విశ్వనాథ్ అన్నారు. మంచాల మండల పరిధిలోని ఆరుట్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం 'ప్రజలు–చట్టాలు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రజలు చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. చాలా మంది చట్టాలపై అవగాహన లేక అనవసరంగా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. గ్రామంలో అందరు కలిసిమెలసి ఉండాలన్నారు. సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమతంగా ఉండాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మద్యానికి బానిసై విలువైన జీవితాలను పాడు చేసుకోవద్దని తెలిపారు. ప్రతి వాహనదారుడు విధిగా డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ తదితర పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్, ఉప సర్పంచ్ జంగయ్య గౌడ్, ఏఎస్ఐ సతీష్, వార్డు సభ్యులు, శివ, వెంకటేశ్, మల్లేశ్, మమత, స్వప్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జానీపాషా, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుల నియామకం



నియామకపత్రం అందజేస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎస్సీసెల్ అధ్యక్షుడిగా పెద్దఅంబర్‌పేటకు చెందిన మాజీ సర్పంచ్ పెంటయ్య నియమితులయ్యారు. అదే విధంగా పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం ఎస్సీసెల్ అధ్యక్షుడిగా బొర్ర శ్రీకాంత్‌ను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ఎస్సీసెల్ అధ్యక్షుడు బర్ర రాజ్‌కుమార్, పీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి మంగళవారం వారి చేతుల మీదుగా పెంటయ్యకు, శ్రీకాంత్‌కు నియామకపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరి, నాయకులు దాసు, గోవర్ధన్‌గౌడ్, శంకరయ్య, జ్ఞానేశ్వర్, నరేష్, లక్ష్మారెడ్డి, అప్పన్న, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

భగీరథ ట్యాంకును నిర్మించండి

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి



వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: కడ్తాల్ మండల కేంద్రంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతనంగా లక్ష లీటర్ల కెపాసిటీతో మంచినీటి ట్యాంకు ఏర్పాటు చేయాలని, అదే విధంగా ఇటీవల నిర్మించిన ట్యాంకును అనుసరించి, నూతన పైపులైన్ నిర్మాణం చేపట్టాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో ఇంజనీర్ ఇన్‌చీఫ్ కృపాకర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సిఫారస్ పత్రంతో పాటు, గ్రామ పంచాయతీ పాలకమండలి తీర్మాణ పత్రాన్ని జలమండలి అధికారులకు అందజేసినట్లు తెలిపారు. వారు సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ తెలిపారు.

ఎంపీపీ కార్యాలయం వద్ద సీసీ కెమెరాలు

సాక్షి ఎఫెక్ట్..

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని జమ్మిచెట్టుకు క్షుద్రపూజలు చేసారంటూ 'సాక్షి పత్రిక'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు సూపరింటెండెంట్ క్రాంతికిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయం వద్ద కొత్త వ్యక్తికి నైట్ వాచ్‌మెన్ బాధ్యతలను అప్పగిస్తున్నట్లు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, న్యాయస్థానం ఉన్న సంగతి తెలిసిందే. గుర్తుతెలియని వ్యక్తులు అక్కడ ఉన్న జమ్మిచెట్టుకు మూటతో కూడిన నల్లని వస్త్రం కట్టి ఉండటం, క్షుద్రపూజలు చేసినట్లు ఆనవాళ్లు కనిపించడంతో పలువురు భయాందోళనకు గురయ్యారు. ఈవిషయమై 'సాక్షి' దినపత్రికలో శనివారం ప్రత్యేక కథనం రావడంతో అధికారులు స్పందించి ఆఫీసు ఆవరణలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. పూజలు చేసిన వ్యక్తులు ఎవరో ఆరా తీస్తున్నట్లు సూపరింటెండెంట్ ఈ సందర్భంగా తెలిపారు.

రాజకీయాలపై ఆసక్తి పెంచుకోవాలి



విద్యార్థి నాయకులతో అతిథులు

హయత్‌నగర్: సామాజిక రాజకీయ అంశాలపై కూడా విద్యార్థులు ఆసక్తిని పెంచుకోవాలని హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం హయత్‌నగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో జరిగిన విద్యార్థి నాయకుల ఎన్నికలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. పాఠశాల డీన్ శ్రీదేవి, డీఐ రాజేష్ పాల్గొన్నారు.

వనస్థలిపురం: వనస్థలిపురంలోని రవీంద్ర భారతి పాఠశాలలో నిర్వహించిన విద్యార్థి నాయకుల ఎన్నిక (ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ)లకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్ఐ పరమేష్‌తో కలసి విద్యార్థులకు బ్యాడ్జీలు అందజేశారు.

విధి నిర్వహణలో ఉండగా..

- రోడ్డు ప్రమాదంలో ఉద్యోగి దుర్మరణం
- పట్టించుకోని కంపెనీ యాజమాన్యం
- మృతుడి బంధువుల ఆందోళన



కంపెనీ ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, నాయకులు

తుర్కయంజాల్: విధి నిర్వాహణలో ఉండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉద్యోగి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం తుర్కయంజాల్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీ ఎదుట మృతదేహంతో.. మృతుడి కుటుంబ సభ్యులు, వివిధపార్టీల నాయకులు ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. ఇబ్రహీంపట్నం మండలం రాయపోలు గ్రామానికి చెందిన వనమల్ల నర్సింహ (48) గడిచిన 5 సంవత్సరాలుగా తుర్కయంజాల్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఆన్ డ్యూటీలో ఉండగా ఔటర్‌రింగ్ రోడ్డుపై శామీర్‌పేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందంటూ విమర్శలు వచ్చాయి. పోస్టుమార్టం అనంతరం మృతదేహంతో బంధువులు, వివిధ పార్టీల నాయకులు.. కంపెనీ ఎదుట బైటాయించి ఆందోళనకు దిగారు. కంపెనీ గేటు మూసి ఉండటంతో పోలీసులు జోక్యం చేసుకుని, కంపెనీ యజమానులతో మాట్లాడి మృతుడి కుటుంబానికి న్యాయం చేయిస్తామని హామీ ఇవ్వడంతో అంతా ఆందోళన విరమించారు.

విద్యార్థినికి ఆర్థికసాయం

కడ్తాల్: నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చేయూతనందిస్తుందని ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ అన్నారు. మాడ్గుల మండల పరిధిలోని అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ముత్యాలుది నిరుపేద కుటుంబం కావడంతో తన కూతురు సరితను ఇంటర్ చదివించేందుకు ఇబ్బందులు పడుతున్నాడు. స్థానిక నాయకుడు శేఖర్‌తో కలిసి ఇటీవల ఉప్పల వెంకటేశ్‌ను కలిసి సమస్యను వివరించారు. స్పందించిన వెంకటేశ్ విద్యార్థిని సరిత ఉన్నత చదువుల కోసం ట్రస్ట్ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యుడు డాక్టర్ అఖిల్ మంగళవారం సరితకు రూ.15 వేల చెక్కును అందజేశారు. భవిష్యత్‌లో ట్రస్టు తరపున అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్, విజేందర్ పవార్, భాస్కర్‌గౌడ్, నాయకులు ఉన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం

హయత్‌నగర్: రంగారెడ్డి జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మొబైల్ మెడికేర్ యూనిట్ ద్వారా మంగళవారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధి కుంట్లూర్‌లోని సీనియర్ సిటిజన్ భవనంలో వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 89 మంది వృద్ధులకు బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ప్రతీనెల వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ పాండుగౌడ్, విజయ్‌కుమార్, కోశాధికారి రాఘవరెడ్డి, కాటం సూరయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో భారీ వర్షం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. జూన్ నెలలో మృగశిర కార్తి ప్రారంభమైన తర్వాత వర్షాల కోసం రైతులు ఎదురుచూసిన ఫలితం లేకుండా పోయింది. జూన్ నుంచి ఇప్పటి వరకు అడపాదడప వర్షాలు కురిసినా భూమి పదనుపట్టేంత పడలేదు. దీంతో మెట్ట పంటలు వేసుకోలేని దుస్థితి నెలకొంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొన్న ఈ తరుణంలో సుమారు 20 గంటలకు పైగా చిరుజల్లులతో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. భూమి పదను పట్టడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. మంగళవారం 18 మి.మీటర్ల వర్షపాతం నమోదయ్యింది. ఇలాగే మరో నాలుగైదు వర్షాలు కురిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. భూగర్భజలాలు కూడా పెరగనున్నాయి. ప్రజలకు ఉక్కపోత నుంచి ఉపశమనం లభించినట్లయ్యింది.

నులిపురుగులను నివారిద్దాం

ఎంపీపీ నిర్మల



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారిణి

తలకొండపల్లి: ఈనెల 20న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని(ఎన్‌డీడీ) విజయవంతం చేయాలని ఎంపీపీ నిర్మల పిలుపునిచ్చారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన.. ఏఎన్ఎం, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు.. కల్పన, సైదమ్మ నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 1 నుంచి 19 సంవత్సరాల్లోపు బాలబాలికలకు నులిపురుగు వ్యాధి నివారణ మాత్రలు తప్పనిసరిగా వేయించాలన్నారు. 1 నుంచి 2 సంవత్సరంలోపు వారికి సగం మాత్ర, 2 నుంచి 3 సంవత్సరాల్లోపు వారికి ఒక మాత్ర, 3 నుంచి 19 సంత్సరాల లోపు వారికి 2 మాత్రలు వేయాలని తెలిపారు. తలకొండపల్లి, గట్టు ఇప్పలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల, ఇతర పిల్లలను కలిపి మొత్తం 13,500 మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయనున్నామని డాక్టర్లు తెలిపారు. నులిపురుగులతో పిల్లలు తరచుగా అనారోగ్యం పాలవుతారని చెప్పారు. చదువు పట్ల ఆసక్తి తగ్గుతుందన్నారు. నులిపురుగుల మాత్రలు వేసుకుంటే పిల్లలో రక్తహీనతను నివారించవచ్చన్నారు. ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీకాంత్, రామచంద్రయ్య, ఆశ, అంగన్‌వాడీ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

కడ్తాల్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు 38వ అధ్యక్షుడిగా యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, కార్యదర్శిగా గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారిగా కొరివి వెంకటయ్య, పీఆర్‌ఓగా పాషా నియమితులయ్యారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఏర్పాటై 37 సంవత్సరాలు పూర్తి చేసుకుని 38వ సంవత్సరంలోకి అడుగిడుతున్న క్రమంలో 38వ అధ్యక్షుడిగా మాడ్గుల మండలం సుద్దపల్లి గ్రామ సర్పంచ్ యాచారం వెంకటేశ్వర్లు గౌడ్‌ను నూతన అధ్యక్షుడిగా నియమించారు. ఈ నేపథ్యంలో బుధవారం పీఆర్‌ఓ పాషా మాట్లాడుతూ.. ఈనెల 21న మండల పరిధిలోని అయ్యసాగర్ డీఎంకే ఫంక్షన్‌హాల్‌లో నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. దీంతో పాటు లియోక్లబ్ ఆఫ్ ఆమనగల్లు 14వ అధ్యక్షుడిగా తరుణ్, కార్యదర్శిగా వంశీకృష్ణ, కోశాధికారిగా జగదీశ్‌గౌడ్‌తో పాటు కార్యవర్గం కూడా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫాస్ట్ మల్టిపుల్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ మహేంద్రకుమార్‌రెడ్డి, క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్లు చెన్నకిషన్‌రెడ్డి, రమేష్‌బాబు, రీజియన్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జోన్ చైర్‌పర్సన్ శేఖర్‌రెడ్డి, ప్రోగ్రాం చైర్మన్ సుధీర్‌రెడ్డి, కోచైర్మన్ బాలకృష్ణ, లయన్ నర్సింహ, మాస్టర్ ఆఫ్ సెర్మనీ డాక్టర్ దామోదర్‌రెడ్డి తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



అబ్దుల్లాపూర్‌మెట్: నిరసన ర్యాలీలో జీపీ కార్మికులు, సీఐటీయూ నాయకులు

హయత్‌నగర్: పంచాయితీ కార్మికులు 13 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మెలో భాగంగా మంగళవారం కార్మికులు హయత్‌నగర్‌లోని జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్, కనకయ్య, గుండె శివ, శంకరయ్య, సిబ్బంది.. వెంకటమ్మ, లింగం, బాతయ్య, యాదమ్మ, కవిత, మల్లయ్య, లక్ష్మమ్మ, జ్యోతి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మంచాల మండలంలో..

మంచాల: గ్రామ పంచాయతీ కార్మికులు రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా మంళవారం మంచాల మండల పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల ఎదుట ధర్నా కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ కృష్ణ కార్మికుల సమ్మెకు సంఘీబావం ప్రకటించారు.